# భార్యంటే ...?

"నారాయణగారికి,

నమస్తే, నేను ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా దేశాలకు వెళ్ళాలనుకుంటున్నాను. ఇస్లాం మత స్థాపనకు పూర్వం సౌత్ వెస్ట్ ఏషియా దేశాలతో భారతదేశానికి వర్తక వాణిజ్య సంబంధాలుండేవి. భారతీయులపట్ల ఎంతో గౌరవభావం వుండేది ఆ దేశాల ప్రజలకు. కాబాలో భద్రపరచబడ్డ బంగారు ఫలకాలమీద చెక్కిన కావ్యాలను సంగ్రహించి హరున్-అల్-రషీద్ ఒక గ్రంథం కూర్చాడు. ఆ కవితల్లో భారతీయులనుగూర్చి గౌరవపూర్వకమైన ప్రస్తావన వుంది.

ఇస్తాంబుల్ గ్రంథాలయంలో భద్రపరచబడ్డ 'సైరుల్ అకుల్' అనే అరబ్బీ కావ్య సంగ్రహంలో మహమ్మద్ ప్రవక్తకు వేయి సంవత్సరాల పూర్వం జీవించిన లబిబిన్ అఖతఫ్ తుర్ఫా అనే అరబ్బీ కవి కవితలో భారతదేశాన్ని పుణ్యభూమిగా పేర్కొనటం జరిగింది. ఆ కవి వేదాలపట్ల కూడా ఎంతో గౌరవభావం వ్యక్తపరిచాడు.

మహమ్మద్ ప్రవక్త పెద్ద తండ్రి ఉమర్ బిన్ హిశ్శాం ఓ గొప్ప కవి. ఆయన తన కవితలో 'ఓ ప్రభూ! నా జీవితం మొత్తం నీకర్పిస్తాను. బదులుగా భారతదేశంలో ఒక్కరోజు నివసించే అనుగ్రహాన్ని ప్రసాదించు' అని ప్రార్థించాడు. వ్యాపార సంబంధ కారణంగా ఎంతోమంది భారతీయులు ఆ ప్రాంతాలకు వెళ్ళేవాళ్ళు. అబూ-యూసుఫ్-బిన్-ఇబ్రహీం తన గ్రంథం 'కితాబ్ ఉరూఖిరాజ్'లో బస్రానగరంలో ఓ పేటంతా భారతీయులే వుండేవారనీ, దాన్ని 'హిందూభూమి' అని పిల్చేవారనీ రాశాడు. ఇంకా ఇలాంటివి ఎన్నో. ఇవన్నీ పాత విషయాలు. ఇంకా కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే ఇప్పుడు మనం దేన్నయితే ఇండో-ఇస్లామిక్ ఆర్కిటెక్చర్ అంటున్నామో, దాన్ని ఇండియన్ ఆర్కిటెక్చర్ అనే పిలవాల్సి వుంటుందని నా ఉద్దేశం. భారతీయులు అధిక సంఖ్యలో సౌత్-వెస్ట్ ఏషియా దేశాలకు వెళ్లారు. తమతోపాటు తమ వాస్తుకళను కూడా తీసుకువెళ్ళేవుంటారు. ఆయా దేశాల్లోవున్న వాస్తుకట్టడాల్ని అధ్యయనం

చేస్తేగానీ, భారతీయ వాస్తుశాస్త్రం అక్కడి వాస్తుకళను ఎలా ప్రభావితం చేసిందో తెలియదు. అక్కడి వాస్తుకళలో ఎంతవరకు మిళితమైందో తెలియదు.

ఈ ప్రయత్నంలో ఆయా దేశాలకు వెళ్ళాలనుకుంటున్నాను. ఉద్యోగానికి శలవుకు అప్లై చేస్తున్నాను. మా వారికీ విషయాలన్నీతెల్సు. ఆయనా అంగీకరించారు. విదేశాలకు వెళ్లాలంటే చాలా ఖర్చవుతుంది. 'బాంకులో మూడులక్షలున్నాయి. ఫ్లాట్ అమ్మేస్తే మూడు నాలుగు లక్షలన్నా వస్తుంది. అదీ పట్టుకెళ్ళు' అన్నారు. అకస్మాత్తుగా ఆయన ఏక్సిడెంటులో పోవటం జరిగింది.

వీలునామాలో ఆయన ఆస్తికి 'పవర్ ఆఫ్ అటార్నీ' మీకెందుకిచ్చారో నాకు తెలియదు. దయ వుంచి ఫ్లాటును, డబ్బును వీలయినంత త్వరలో నాపరంచేస్తే, నా ప్రయత్నాలు నేను చేసుకోడానికి వీలవుతుంది.

నా ప్రయత్నాల్లో నేను సఫలం అయితే ఆయన ఆత్మశాంతిస్తుంది. నా ప్రయత్నాలకు ప్రోత్సాహం, సాయం చెయ్యాల్సిన బాధ్యత మీ మీద వుంది. నా భర్త ఆప్తమిత్రులుగా అది మీ కనీస కర్తవ్యం.

వుంటాను... ఎప్పుడు ఆస్తి నాపరం చేస్తారో వెంటనే తెల్పండి.

- సంధ్య''

ఉత్తరం చదివి బల్లమీద పడేశాను. ''మరి ఏం చేద్దామనుకుంటున్నారు?'' అడిగింది మా ఆవిడ.

''ఏం తోచటంలేదు'' అన్నాను.

''ఏముందీ తోచేందుకు? న్యాయంగా ఆమెకు రావాల్సిన ఆస్తి కదా! కట్టుకున్న భార్యని కాదని ఆ ఉంపుడుగత్తెకు ఆస్తి పంపకం పెట్టటం నాకేం నచ్చలేదు.''

''భార్యంటే ఏమిటి?''

''అయ్యో చోద్యం! ఇన్నాళ్ళూ నాతో కాపురం చేసి భార్యంటే ఏమిటని నన్నడుగుతున్నారా!''

''ఆమె భార్యంటే నా మనసు ఒప్పుకోవటంలేదు. మాశాయి కథ నీకు సరిగ్గా తెలీదు - విను'' అని తీరిగ్గా కుర్చీలో కూర్చుని మా శేషశాయి కథ చెప్పసాగాను.

★ ★ ★

బొంబాయి నుండి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫరయి వచ్చిన శేషశాయి ఆఫీసులో జాయినవగానే డిక్టేషన్‌కోసం వచ్చిన స్టెనో లలితను అడిగాడు. ''మీకు తెలిసినవాళ్ళ ఇళ్లల్లో ఓ గది అద్దెకు దొరుకుతుందేమో కనుక్కుని చెప్తారా?'' అని.

''గ్లాడ్... మీరు తెలుగువారేనన్నమాట. ఒక గదేం సరిపోతుంది. మీ కుటుంబాన్ని

తీసుకురారూ'' అంది లలిత.

''నేను బాచిలర్‌నండీ - పెళ్ళిచేసుకోలేదు. ఓ గది చాలు.''

ఆ తరువాత తెల్సింది లలితకు - శేషశాయిది గుంటూరు, అతని తండ్రి లోకల్‌ఫండ్ ఆఫీసులో పనిచేసి, రిటైరయిన సంవత్సరానికల్లా పోయాడు. ఉద్యోగంలో వున్నప్పుడూ ఆయన సంపాదన అంతంత మాత్రమే. ఆయన పోయేనాటికే శాయి ఉద్యోగం చేస్తున్నాడు. అతని అక్క స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. పెద్ద చెల్లెలు బి.ఎ పాసయి ఏం ఉద్యోగం దొరక్క ఇంట్లోనే వుండిపోయింది. రెండో చెల్లెలు ఏడో తరగతి చదువుతోంది. తమ్ముడు ఇంకా చిన్నక్లాసులోనే వున్నాడు. ఆపైన రోగిష్టి తల్లి. ఉన్నకొద్దీ ఆస్తి అమ్మి ఆర్చి అక్కకూ, పెద్దచెల్లికీ పెళ్ళి చేసేటప్పటికి అతని పురమారింది. తల్లి కొడుకును పెళ్ళిచేసుకోమందిగానీ, చెల్లెలి పెళ్ళి కాకుండా, తమ్ముడోదారి పట్టకుండా వివాహం చేసుకోవటం అతనికిష్టంలేదు. ఆ రెండూ అయేటప్పటికి అతనికి 45 ఏళ్ళువచ్చాయి. ఆ తర్వాత తల్లి చనిపోవటంతో పెళ్ళిచేసుకోమని పోరు పెట్టేవాళ్ల లేకపోయారు. అతనికీ పెళ్ళిమీద ఇచ్ఛ నశించింది. ఇప్పుడతను ఆఫీసరయాడు. సంపాదన బాగానే వుంది. పెళ్ళికాలేదన్న ఒక్కలోపం తప్ప అతని జీవితం హాయిగా గడిచిపోతూనే వుంది.

లలిత తమ ఇంటికి దగ్గరగానే అతనికి ఓ గది వెతికిపెట్టింది. శేషశాయితో పరిచయం అధికమైనకొద్దీ ఆమెలో ఓ పథకం రూపుదిద్దుకోసాగింది. ఆ పథకంలో భాగంగానే ఆఫీసుకు కల్చరల్ అసోషియేషన్ వార్షికోత్సవాలకు వక్తగా ఎవర్ని పిలవాలని ప్రశ్న వచ్చినప్పుడు తెలివిగా తన చెల్లెలు సంధ్యను పిలవమని కల్చరల్ సెక్రటరీకి సూచించింది లలిత. సంధ్య యూనివర్సిటీ ఇండాలజీ డిపార్ట్‌మెంటులో రీడర్‌గా పనిచేస్తుండటంతో ఒక విద్యావేత్తను వక్తగా ఆహ్వానించటానికి ఎవరికీ అభ్యంతరం లేకపోయింది.

వార్షికోత్సవంలో సంధ్య అద్భుతంగా ఉపన్యసించింది. సాంస్కృతికసభ కనుక సంస్కృతిని గురించే మాట్లాడింది. ఉపన్యాసమయింతర్వాత శేషశాయి ఆమెని అభినందించాడు ''చాలా బాగా మాట్లాడారు'' అని.

సంధ్య నవ్వి అంది - ''బాగా మాట్లాడటం మా ఉద్యోగం.''

''మాట్లాడటం కూడా కళే. మీ అమూల్య సమయాన్ని మాకోసం వెచ్చించారు'' అన్నాడు శాయి కృతజ్ఞతలు తెల్పుతూ.

''ఎక్స్ట్రా క్లాసు ఒకటి తీసుకుంది మా చెల్లాయి. అంతకంటే ఏంలేదులెండి'' అంది లలిత.

''నిజమే... నేనివాళ కొత్తగా చెప్పిందేంలేదు. రోజూ చెప్పే పాఠమే. మొదటిసారిగా వినటంవల్ల మీకు నచ్చింది. అంతకంటే ఏంలేదు'' అంది సంధ్య.

''భారతీయ సంస్కృతి, విదేశీ సంస్కృతి అంటూ మాట్లాడారు. ఇలా పరిమితంచేసే

విశేషణాలు లేని అంతర్జాతీయ సంస్కృతి అనేదేమయినా వుందా?'' అడిగాడు శాయి.

''చక్కటి ప్రశ్న వేశారు. అసలు సంస్కృతి అంటే ఏమిటి? సంస్కృతి అనేది ఆచారాల్నీ, నమ్మకాల్నీ అధిగమించింది. సంస్కృతి అంటే మనం ఇతర్లతో ప్రవర్తించే తీరు. మనం ఇతర్లని సరిగ్గా అర్థం చేసుకోవటం, ఇతరులచేత సరిగ్గా అర్థంచేసుకోబడటం సంస్కృతి. మానవుల్లో భిన్నత్వాన్నేకాదు, ఏకతా సూత్రాన్ని గుర్తించగలగడం సంస్కృతి...''

''ఇక చాల్లేవే నీ ఉపన్యాసం. అయ్యో! శేషశాయిగారూ! మీరు మమ్మల్ని డ్రాప్ చేస్తానని చెప్పి ఇంతసేపు నిలబెట్టి మాట్లాడటం ఏం సంస్కృతి. భారతీయ సంస్కృతా, విదేశీ సంస్కృతా..'' అని. ''ఏం అనుకోకండి, ఇవాల్టి ఈ స్వేచ్ఛా వాతావరణంలో మీరు మా బాస్ అని గమనించకుండా మాట్లాడాను'' అంది నవ్వుతూ లలిత.

''మీరెప్పుడూ అలాగే మాట్లాడాలి లలితా! సంస్థలో అందరూ సమానులే. పెద్దా చిన్నా ఏం లేదు. అందరూ కల్సి టీం స్పిరిట్‌తో పనిచేస్తేనే ఏదయినా సాధించగలం. అదే సంస్కృతి కదండీ సంధ్యగారూ!'' అన్నాడు శేషశాయి బయటకు దారితీస్తూ.

అక్కచెల్లెళ్లనిద్దర్నీ కంపెనీ కారులో వాళ్ల ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెళ్ళబోతుంటే లలిత అతన్ని ఇంట్లోకి రమ్మని ఆహ్వానించింది. వాళ్ళది చిన్న ఇల్లు. ముందున్న కొద్దిజాగాలోనే చిన్న పూలతోట. ఇల్లు చాలా పొందిగ్గా అలంకరించివుంది. వాళ్లతండ్రి పరమేశంగారు ముందు గదిలో పడుకునున్నాడు. వీళ్ళు రావటంచూసి కళ్ళు తెరచి చూశాడు కాని కనీసంలేచి అతిథిని పలకరించాలని కూడా ప్రయత్నంచేయలేదు.

''రండి... ఇలా హాల్లో కూర్చోండి. నాన్నకు మళ్ళీ ఆస్తమా అటాక్ వచ్చినట్టుంది'' అంది సంధ్య.

లలిత కాఫీ కలుపుకురావటానికి లోపలకు వెళ్ళింది. హాల్లో చెక్కదండ వేలాడదీసిన ఓ యువకుడి ఫోటోవంక శేషశాయి చూస్తూవుంటే చెప్పింది సంధ్య. ''అది మా బావగారిది. పన్నెండేళ్ళయింది ఆయన కాస్పరుతోపోయి'' అని.

''ఓ...సారీ, గుర్తించలేకపోయాను, ఆమె రోజూ బొట్టుపెట్టుకునే ఆఫీసుకు రావటంవల్ల'' అన్నాడు శాయి నొచ్చుకుంటూ.

''మా అక్క ఒకంతట ఒప్పుకోలేదు. నేనే బలవంతం చేసి ఒప్పించాను. బొట్టు ఓ అలంకరణ. అది భర్తతో వచ్చింది కాదు, భర్తతో పోవటానికని చెప్పి''

''మంచి పనిచేశారు'' అన్నాడు శాయి.

లలిత కాఫీ కలుపుకొచ్చి ఇచ్చింది శాయికి. చీరె మార్చుకుని ముఖం కడుక్కున్నట్లుంది.

కథా నిలయం
3616
శ్రీకాకుళం

ఇప్పుడామె నుదుట బొట్టులేదు. అంత ఉత్సాహంగా, ఆనందంగా కన్పించే ఆమె జీవితంలో విషాదం నిండివుందని అతనూహించలేదు. తన భర్త, పిల్లలతో సుఖంగా గడిచే జీవితం ఆమెది అనుకున్నాడతను.

అప్పటికే బాగా పొద్దుపోవటంవల్ల - ''మరి నేవస్తాను'' అని వాళ్లకు వీడ్కోలు పలికి వచ్చేశాడతను.

తరువాత మరి వారంరోజులకు లలిత శేషశాయిని ఆహ్వానించింది తమ ఇంటికి. ''మా సంధ్య మీరు మళ్ళా కన్పించలేదేమని అడిగింది. ఇవాళ దాని పుట్టినరోజుకూడాను. రాగూడదూ'' అన్నది.

''మరి చెప్పరేం... సాయంత్రం కలిసే వెళ్దాం. మీ నాన్నగారి ఒంట్లో ఎలా వుంది?''

''ఫరవాలేదు... బాగానే వున్నాడు. ముసలి తనంకదా, ఎప్పుడూ ఏదో నలత వుంటూనే వుంటుంది.''

సాయంత్రం వాళ్ళ ఇంటికి వెళ్లే తోవలో ఓ నిర్మల్ పెయింటింగ్ సంధ్యకు పుట్టినరోజు కానుకగా కొన్నాడు శేషశాయి. వాళ్ళు వెళ్ళేటప్పటికి బయట పూలతోటలో పేము కుర్చీలో కూర్చునున్నాడు పరమేశంగారు. సంధ్యలోపల వున్నట్టుంది. లలిత శేషశాయిని తండ్రికి పరిచయంచేసింది.

''రండి... రండి... మా అమ్మాయి మీ గురించి చెప్తూనే వుంటుంది. ఇవాళ్టికి పరిచయభాగ్యం కలిగింది'' అన్నాడాయన లేచి, శాయిని తన ఎదురుగుండా వున్న మరో పేముకుర్చీలో కూర్చోమని ఆహ్వానిస్తూ.

లలిత ఇంట్లోకి వెళ్ళిపోయింది.

గులాబీలు, మల్లెలు, సన్నజాజులూ మరెన్నో పూలమొక్కలు. చాలాభాగం మొక్కలు పూలకుండీల్లోనే వున్నాయి. ఆ పూలనుండి పల్చటి సుగంధం గాలిలో వ్యాపిస్తోంది. పూలన్నీ మొక్కలకు అలాగే వున్నాయి. ఒక్క పూవు కోసినట్టులేదు.

''బావుంది మీ చిన్న పూలతోట. విరగబూసిన పూలతో మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తోంది'' అన్నాడు శాయి మెచ్చుకుంటూ.

''అంతా మా పెద్దమ్మాయి కృషి. పాపం దానికి పూలు పెట్టుకునే రాతలేదు కదా! చిన్న దానికసలు పూలు పెట్టుకోవటం ఇష్టముండదు'' అన్నాడాయన నిట్టూరుస్తూ.

''ఏం?''

''అదంతే... దానికెప్పుడూ దాని పుస్తకాలు, చదువు గొడవే. ముందు పి.హెచ్.డి. చేయాలంది. పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ అంటుంది. పెళ్ళి మాటంటే గిట్టదు. ఇప్పుడు ముప్పై

ఐదేళ్ళు వచ్చాయి ఇంక నాకు పెళ్ళేంటీ అంటుంది. దానికిమాత్రం ఎంత వయస్సు! ఇద్దరికీ రెండేళ్ళేకదా తేడా. పెళ్లయిన రెండేళ్ళు కూడా బతుకున్నాడో లేదో అతను. అప్పట్నించీ పోరుతూనే వున్నాను. 'మళ్ళీ పెళ్ళిచేసుకోవే. వయసేం ముదిరిపోయింది' అని. వినదు. వాళ్ళమ్మకీ బాధ లేకుండాపోయింది. నాకే చావురాకుండా వుంది. నా తరువాత మొగదిక్కులేకుండా ఎలా నెగ్గుకొస్తారో అన్నదే నా దిగులు'' అన్నాడాయన.

లలిత రెండు ప్లేట్లలో టిఫిన్ పట్టుకొచ్చింది. తండ్రికీ, శాయికీ ఆప్లేట్లు అందిస్తూ చెప్పింది. ''సంధ్య ఇప్పుడే వస్తుంది. అది చక్కటి బొమ్మలు వేస్తుంది, అమెచ్యూర్ ఆర్టిస్ట్. గోల్కొండఫోర్ట్, కుతుబ్‌షాహి సమాధులు చిత్రించింది. మీరు చూడాలి. దాని ఆల్బం పట్టుకువస్తాను'' అంటూ లోపలకు వెళ్ళింది.

''అవును.... ఇండియన్ ఆర్కిటెక్చర్ మా సంధ్య అభిమాన విషయం. దాని సిద్ధాంతాలు మాకు చెప్తూ మా తల బొప్పి కట్టిస్తూ వుంటుందిలెండి. మాకు ఆ సబ్జెక్ట్‌లో కొంత ప్రవేశం కలుగజేసింది. ఇప్పుడో పుస్తకం రాస్తున్నది. గాంధార శిల్పం, గుప్త శిల్పం, కాకతీయ, విజయనగర, హోయసాల శిల్పాలని వేరువేరుగా వున్నాయికాని, ఆయా శిల్పశైలుల ప్రత్యేకతలేమిటి, ఒకదానికి మరొకటి ఎలా భిన్నం. ఈ విషయంలో ఎవరికీ స్పష్టమైన అవగాహన లేదని దాని ఉద్దేశ్యం. ఈ ప్రయత్నంలో రకరకాల ప్రదేశాలకు వెళ్ళి వస్తుంది. అక్కడి కళా సంపద కాగితాల మీద పెట్టి తీసుకొస్తుంది. దీని ధ్యాసంతా ఆ పుస్తకంమీదే. అంతగా ఓ విషయంలో లీనమయి పనిచేసే శక్తి దీనికా భగవంతుడిచ్చిన వరం'' అన్నాడు పరమేశంగారు. తన కూతుర్ని గూర్చిన ప్రశంసలో ఇందాకటి నిర్వేదం లేదు.

లలిత ఇంట్లోనుండి ఓ పెయింటింగ్స్ ఆల్బం తీసుకువచ్చి శాయికిచ్చింది. అతడు పేజీలు తిరగెయ్యసాగాడు. సంధ్య చెరో కప్పులో శాయికి, తండ్రికి కాఫీలు పట్టుకొచ్చింది. శాయి ఆమెకు పుట్టినరోజు అభినందనలు తెల్పి, తను తెచ్చిన కానుకనందించాడు.

ఆమె కుర్చీ శాయి దగ్గరగా లాక్కుని కూర్చుంటూ అంది, ''కుతుబ్‌షాహి కట్టడాల బొమ్మలు చూస్తున్నారా? కాని ఇలా కాదు వాటిని చూడటం, వాటి చరిత్ర, ఆరోజులు, అవి ఎవరి కట్టడాలో తెల్సుకుంటూ చూస్తే మీరు వాటిని సరిగ్గా అప్రీషియేట్ చేయగలుగుతారు''.

''మరి నాకు తెలియదుగా ఆ చరిత్ర. నా కళ్ళకు బాగానే వున్నాయవి'' అన్నాడు శాయి.

''హైదరాబాదులో వున్న కట్టడాలు దక్కనీ శైలివి. దక్కనీ శైలికి సంబంధించిన వాస్తు నిర్మాణాల్లో ముఖ్యంగా చెప్పుకోవల్సినవి గుల్బర్గా, బీదర్, గోల్కొండలోవి. 13వ శతాబ్దం నుండి 17వ శతాబ్దంవరకు 350 సంవత్సరాలు సాగిన ప్రాంతీయ వాస్తు కళ అది. ఇండో-ఇస్లామిక్ ఆర్కిటెక్చర్ నేపథ్యంలో డెవలప్ అయిన మిగతా ప్రాంతాల వాస్తుకు దీనికీ భిన్నత్వం వుంది. మిగతా ప్రాంతాల వాస్తు నిర్మాణాలలో వున్న భారతీయ ఇస్లామిక్ వాస్తుల మేలు కలయిక ఈ

డక్కనీ శైలిలో ముఖ్యం. డక్కనీ సుల్తానులు అంతకుముందే ఇక్కడ పరిఢవిల్లుతున్న ద్రవిడ, చాళుక్య వాస్తుకళను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఈ కట్టడాలమీద రెండు రకాల ప్రభావాలు పడ్డాయి. మహమ్మద్ బీన్ తుగ్లక్ 1340లో తన రాజధానిని దౌల్తాబాదుకు మార్చటంతో ఇంపీరియల్ శైలి కొంత దక్షిణానికి వచ్చింది. రెండో ప్రభావం సూటిగా పర్షియానుండి దిగుమతైంది. అందువల్ల ఈ కట్టడాల్లో ఇరానియన్ ఇన్ఫ్లుయెన్స్ స్పష్టంగా కన్పిస్తుంది. గోల్కొండ కట్టడాలు డక్కనీ శైలి నిర్మాణాలలో చిట్టచివరివి. అది కుతుబ్‌షాహీ వంశపు రాజులకాలంలో 1512 నుండి 1687 వరకు పరిఢవిల్లిన కళ'' సంధ్య చెప్పుకుపోతోంది. తన అభీష్ట విషయాన్ని గూర్చి చెప్పటంలో ఆమె తనను తాను మర్చిపోయింది. పరమేశంగారు ఆమెవంక మెచ్చుకోలుగా చూస్తున్నాడు.

''కుతుబ్‌షాహీ రాజుల సమాధులు పథకంలో బీదర్‌లోని బహ్మనీ రాజుల సమాధుల్లాగానే వుంటాయి. చక్కటి వర్తులాకారపు పాట్టర్న్స్ వున్నాయి. నిర్మాణంలో మంచి రాయిని ఉపయోగించారు. కాని భవంతి రూపురేఖలను చెడగొట్టేట్టుంది సున్నపు పనితనం. గోల్కొండ రాజుల వాస్తు లక్షణాల్ని వ్యక్తపరిచేది ఏడో రాజు అబ్దుల్లా కుతుబ్‌షా సమాధి. ఆఁ... ఈ పేజీలో వుంది. ఇదే... ఆయన 1672లో పోయాడు. రెండు అంతస్థుల్లో కట్టిన మాన్యుమెంట్ అది. పైన చుట్టూతా బాల్కనీ, దానికి అమర్చిన చిల్లుల జాలీలు, ఎంతో బావుంటుందది. దీనికంటే కాంపాక్ట్‌గా, కట్టిన సమాధి మహమ్మద్ కులీకుత్‌బ్‌షాది. 1611లో ఆయన పోయినప్పుడు కట్టిందది.....

''ఇది చూడండి... ఇది ఎనిమిదో రాజు, కట్టకడపటి కుతుబ్‌షాహీ రాజు అబుల్ హసన్ తానీషాకై ఉద్దేశించి నిర్మించబడ్డ సమాధి. పూర్తికాలేదు. సుల్తానులు తమ జీవితకాలంలోనే తమకోసం సమాధులు నిర్మించుకునే వాళ్ళు. రాజు పోగానే ఆలస్యంలేకుండా ఇంక బొందలో పెట్టటమే. ఈ రాజు కాలంలోనే అక్కన్న, మాదన్న అతని మంత్రులుగా వుండేవాళ్ళు. ఎనిమిది నెలలు గోల్కొండ కోటను ముట్టడించిన ఔరంగజేబ్ చివరికి అబుల్‌హసన్ తానీషాను బందీ చేశాడు. అది 1687లో జరిగింది. తరువాత 15 ఏళ్ళకు ఇప్పుడు మహారాష్ట్రలో వున్న 'రోజా'లో పోయాడు తానీషా. అక్కడే సమాధి చేశారు ఆయన్ని. తన కోసం కట్టుకున్న సమాధి పూర్తిచేయలేకపోయాడు. అతని భౌతిక కాయమూ అక్కడ సమాధి చేయబడలేదు...''

''ఆయనకి పిచ్చెక్కిస్తావా ఏం? ఆ చరిత్రంతా చెప్పటానికి ఇంకా చాలా కాలముంది. ఇవాల్టి కాయన్ని వదిలెయ్'' అంది లలిత వచ్చి తనూ ఓ కుర్చీలో కూర్చుంటూ. లలిత ఆపుచేయకపోయినట్లయితే ఆమె అలా అప్రతిహతంగా చెప్పుకుంటూనే పోయేది.

''ఒక్కమాట చెప్పి ఆపేస్తానే అక్కా! అది చెప్పకపోతే నా మనసుండబట్టదు'' అంటూ శాయివంక తిరిగి అంది - ''కుతుబ్‌షాహీ రాజుల వాస్తుకళకు కీర్తిని ఆపాదించేకట్టడాలివేవీకావు.

1593లో మహమ్మద్ కులీకుతుబ్‌షా విజయచిహ్నంగా కట్టిన చార్మినార్ వాళ్ళ వాస్తుకళకు నిజంగా విజయపతాక నెగరేసింది. మహమ్మద్ కులీకుతుబ్‌షా ఆ వంశంలో ఐదో రాజు. ఆయనే భాగమతి పేరున హైదరాబాదునగరం నిర్మించింది. పురానాపూల్, గుల్జార్ హవుజ్, దారుల్‌షిఫా అనే ఆస్పత్రి ఆయనకాలంలోనే నిర్మించబడ్డాయి...''

''ఇంక ఆపుతావా లేక ఆ ఆల్బం బయటకు విసిరికొట్టేదా?'' అంది లలిత పట్టలేనట్టు.

''నిజంగా ఇంట్రస్టింగ్‌గా వుంది. ఒట్టి బొమ్మలు చూసేకంటే సంధ్య వివరణతోబాగా అర్థమవుతున్నాయి'' అన్నాడు శాయి.

''అలా అనకండి బాబూ! అదింక మిమ్మల్ని వేపుకు తినేస్తుంది'' అంది లలిత.

''భలేవాళ్ళే... ఐ రియల్లీ ఎంజాయిట్''

''అలా చెప్పండి మా అక్కకి. ఎంత సేపూ నా అభిరుచిని ఎగతాళి పట్టించటమే దాని పని...''

''నాన్నా! నువ్వన్నా చెప్పరాదూ దానికి....''

''పిచ్చిపిల్ల చెప్పనివ్వవే! నాకూ వినాలనే వుంది''

నిజంగానే సంధ్య ఏవిషయాన్నయినా అద్భుతంగా చెప్పగలదు. శ్రోతలు ఊపిరి కూడా పీల్చుకోవటం మానేసి ఆమె మాటలు వింటూ వుండిపోతారు.

''బొమ్మలకంటే నిజమైన కళాఖండాల్ని చూపించి వివరిస్తే ఇంకా బాగా ఎంజాయ్ చేయగలిగేవాడిని'' అన్నాడు శాయి.

''నేను ఈసారి ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు మిమ్మల్ని తప్పక తీసుకువెళ్తాను'' అంది సంధ్య.

''అలా కోరి ప్రమాదాలు తెచ్చుకోకండీ'' అంది లలిత.

సంధ్య కుతుబ్‌షాహీ రాజుల చరిత్ర, అంతఃకలహాలు, జీవితాల్లో విషాదం అంతా వివరించి చెప్పింది. రాత్రి ఎనిమిది గంటలైనప్పుడు అంది లలిత ''ఇహ భోంచేద్దాం'' అని.

''ఇంకెవ్వరూ అతిథులు లేరా?'' అడిగాడు శాయి.

''మీరొక్కళ్ళు తప్ప ఇంకెవ్వరూ లేరు. సంధ్యకివ్వన్నీ ఇష్టం వుండవు. మిమ్మల్ని పిలుస్తానంటే మాత్రం అభ్యంతరం చెప్పలేదు'' అంది లలిత.

అలా మొదలయింది సంధ్యాశాయిల స్నేహం. ఆ తరువాత రెండు నెలల్లో ఏడెనిమిది సార్లు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు శాయి. సంధ్య నిశిత హేతువాద దృక్పథం, వాక్పటిమా, లలిత ఆతిథ్యం, ఆదరణ అతనికెంతో నచ్చాయి. లలిత, సంధ్య మూడవపది చివరి సగంలో వున్నట్టు కన్పించరు.

లలితకు 30, సంధ్యకు 25 ఏళ్ళు వున్నట్టు కన్పిస్తారు. లలితది చామనఛాయ, సంధ్య తండ్రిలా పచ్చగా వుంటుంది. ఇద్దరూ సన్నగా, కుదిరిగ్గా, కళ కలిగిన ముఖాలతో వుంటారు. శేషశాయి సంధ్య పాండిత్య ప్రకర్షపట్లా, సునిశిత మేధస్సుపట్లా ఆకర్షితుడయ్యాడు.

ఆ తరువాత రెండు నెల్లకు ఆఫీసులో లలిత అంది - ''రేపు శని, ఆదివారాల్లో సంధ్య, నేనూ వరంగల్, రామప్ప గుడికి వెళ్ళాలనుకుంటున్నాం - మీరూ వస్తారా?'' అని.

శేషశాయికి ఉత్సాహమనిపించింది. అతని నీరవనిశ్శబ్ద జీవితంలో వెలుగు, చురుకుదనం ప్రవేశించినట్లయింది. ''ఎందుకు రాను, తప్పకుండా వస్తాను. మీరింకా పిలవలేదేమని వేచి చూస్తున్నాను. ఆ కళాఖండాలు చూస్తూ, సంధ్య వాటిని గూర్చి వివరిస్తుంటే నిజంగా అద్భుతంగా వుంటుంది. ఐ లైక్ హర్ కంపెనీ'' అన్నాడు అతను.

అయితే ఆ శని, ఆదివారాలు వరంగల్‌కు రావటం పడలేదు లలితకు. పరమేశంగారికి ఒంట్లో బాగుండలేదు. ఉబ్బసం వ్యాధి వున్నదే. ఆ పైన జ్వరం కూడా వస్తున్నది. ఆయన్నలా వదిలి రాలేకపోయింది ఆమె. ఉత్సాహంలో వున్న శాయినీ, సంధ్యనీ ఆపే ప్రయత్నం చెయ్యలేదు ఆమె. తండ్రి నసిగినా, ''వాళ్ళేం చిన్న పిల్లలా నాన్నా! వెళ్ళిరానీ, వాళ్ళ హద్దులు వాళ్ళకు తెల్సులే'' అంది లలిత.

శనివారం పొద్దున్నే బయలుదేరారు సంధ్య, శాయీ. వరంగల్ చేరేటప్పటికి 11 గంటలయింది. హోటల్లో దిగారు. హడావుడిగా రెండు మెతుకులు కతికి వరంగల్ పట్నంలోని కాకతీయ శిథిలాలను చూడటానికి వెళ్ళారు. రిక్షాలో కూర్చుని వెళ్తూంటే సంధ్య స్పర్శకు శాయి మనసు ఏ ఆనందలోకాల్లోనో విహరిస్తున్నట్లుంది. కాని సంధ్య ఏం పట్టించుకునే స్థితిలో లేదు. ఆమె మనసు వెయ్యి సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. కాకతీయ చరిత్ర చెప్పటంలో లగ్నమైవుంది. ఆమె చెప్పసాగింది.

''వేంగి, వెలనాడు, పాకనాడు, రేనాడు, అనే ప్రాంతీయ రాజకీయాభిమానాన్ని తొలగించి, ఆంధ్రదేశాన్నీ, జాతినీ సమైక్యం చేసి ఏకచ్ఛత్రాధిపత్యం కిందకు తెచ్చింది కాకతీయులే. మొదటి బేతరాజుతో ప్రారంభమైన కాకతీయ సామ్రాజ్యం రుద్రదేవుడి కాలంలో పరిణతి పొందింది. ఓరుగల్లును దుర్భేద్యమైన దుర్గంగా రూపొందించింది ఆయనే. వైదిక మతంతో శైవానికి పొత్తు కుదిర్చి, ప్రచారం చేసిన మల్లికార్జున పండితారాధ్యుడు రుద్రదేవుడి సమకాలికుడు. కాకతీయ ప్రభువుల్లో అగ్రగణ్యుడు గణపతిదేవుడు. 'కాకతి రాజ్య భారధౌరేయు'డైన రేచర్ల రుద్రసేనాని ఆయన సేనాధిపతి. ఈయన కాలంలో కాకతీయ సామ్రాజ్యం దక్షిణాన కాంచీపురం వరకు, ఉత్తరాన సింహాచలం వరకు, మొత్తం ప్రస్తుత తెలంగాణా అంతా వ్యాపించింది. గణపతి దేవుడు దివిసీమ మీద దండెత్తి బోడిరాజును ఓడించి ఆయన కూతుళ్ళు నారమ, పేరమలను వివాహ మాడాడు. బావమరది జాయపసేనాని ఆయనసేన గజసాహిణి అయ్యాడు. గణపతిదేవుడికి

మొగిపిల్లర్లేయి. ఆయన కూతురు రుద్రమదేవి పురుషవేషంతో 'రుద్రదేవమహారాజు' అనే పేర క్రీ.శ. 1258 నుండి రాజ్యం చేసింది. స్త్రీ అంటే డిస్‌క్రిమినేషన్ చూపటం, ఇన్‌ఫీరియర్‌గా చూడటం ఈ కాలంలో వున్నట్టే ఆకాలంలోనూ వుంది. ఆడదన్న చులకన భావంతో దాయాదులు తిరుగుబాటుచేశారు. పొరుగున వున్న శత్రువులు రాజ్యాన్ని కబళించచూశారు. కాని ఆమె తిరుగులేని వీరనారి. అందర్నీ అణిచేసింది. రుద్రమదేవి కూతురు కొడుకు ప్రతాపరుద్రుడు ఆ తరువాత రాజ్యానికివచ్చాడు. ఆయన కాలంలో కాకతీయ సామ్రాజ్యం ఉచ్చస్థితి పొందింది. కాని అప్పుడే విచ్ఛిన్నం కూడా అయింది. ఆయనకాలంలో ఐదుసార్లు తురుష్కదండ యాత్రలు జరిగాయి. చివరికి ఢిల్లీ చక్రవర్తి ఘియాసుద్దీన్ సేనాపతి ఉల్ఘాఖాన్ (తరవాతి మహమ్మద్‌బిన్ తుగ్లక్) చేతిలో ఓడిపోయి బందీ అయాడు ప్రతాపరుద్రుడు. ఢిల్లీకి తీసుకువెళ్తూండగా దోవలో మరణించాడు. అలా ఆంధ్రదేశం ఢిల్లీ సామ్రాజ్యంలో లీనమయింది. ఆంధ్రనగరి సుల్తాన్‌పూర్ అయింది. ఇది సంక్షిప్తంగా కాకతీయుల చరిత్ర'' అంది సంధ్య.

''మీకిన్ని విషయాలు ఎలా గుర్తుంటాయి సంధ్యా!'' అన్నాడు శాయి అప్రతిభుడవుతూ.

''ఎందుకు గుర్తుండవు. దీక్షగా అధ్యయనం చేస్తే మీకూ గుర్తుంటాయి'' అంది సంధ్య.

రిక్షాలోంచే కోటగోడను చూపిస్తూ అంది ''మూడు రక్షణ శ్రేణులతో ఓరుగల్లు దుర్భేధ్యమైనకోటగా వుండేది. మొదటిది పుట్టకోట. ప్రస్తుతం దాని శిథిలాలుకూడా కన్పించవు. రెండోది మట్టికోట. దాన్ని పరివేష్టించి కందకం, నాలుగుదిక్కులా నాలుగు ద్వారాలు. ఈ కోటగోడకు ఫర్లాంగు దూరంలో తిరిగి అగడ్త రాతికోట. దీనికీ నాలుగువైపులా బలిష్టమైన ద్వారాలుండేవి. 77 బురుజులుండేవి....''

రిక్షా దిగి లోపలకు వెళ్లారు శాయి, సంధ్యా. సంధ్య చెప్పసాగింది - ''ఇవి స్వయంభూ ఆలయ శిథిలాలయుంటాయి. మిగిలినవీ శిలాతోరణాలే. ఇంత చక్కటి తోరణ ద్వారాలు మరెక్కడా కన్పించవు.''

ఆమె అలా చెప్తూనే వుంది. ఆ ఎండలో ఒడలిపోయినట్లున్న ముఖంతో, పల్చటి పెదాలను నాలికతో తడిచేసుకుంటూ, చెమట పట్టిన నుదుటిమీద పడిన వెంట్రుకలను సుతారంగా చేత్తో పైకి తోసుకుంటూ చెప్పే సంధ్యే పెద్ద కళాఖండంలా, సుందర శిల్పంగా కన్పించింది శాయికి.

సాయంత్రం హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, పద్మాక్షి ఆలయం దర్శించారు. ''స్తంభం చెక్కటంలో కాకతీయ శిల్పులది ఓ ప్రత్యేకత. గుండ్రంగా, పలకలుగా, మళ్ళీ గుండ్రంగా అనేక వర్తులాలతో, పరిణామాలతో చెక్కిన స్తంభం కాకతీయ శిల్ప ప్రత్యేక లక్షణం....'' చెప్పసాగింది సంధ్య.

రాత్రి హోటలికి తిరిగి వచ్చింతర్వాతగానీ సంధ్యకు అలుపు అనిపించలేదు. డైనింగ్ హాల్లో

భోజనం చేసేటప్పుడు అన్నాడు అతను- ''ఎన్నాళ్ళ తరువాత ఇవాళ హాయిగా కాలం గడచిపోయింది. దానికి మీరేకారణం. మీ దగ్గర అంతేవాసిగా వుండిపోతాను''

''మీరా! ఏం అంతేవాసిత్వం చేస్తారు?'' అందామె నవ్వుతూ.

''ఎప్పటికీ మీ దగ్గరే వుండిపోతాను.''

''వుండిపోండి. నాకూ ఎక్కడికి వెళ్ళినా మీతోడు వుంటే బావుండేటట్లు అనిపిస్తోంది. కానీలోకం...''

''కట్టుకుని తీసుకపోండి, లోకమేమంటుంది.''

''దేంతో కట్టి... తాళ్ళతో బంధించా...'' అని ఆమె నవ్వింది.

''ప్రేమపాశంతో బంధించి''

''మీరేవో ప్రమాదకరమైన మాటలు మాట్లాడుతున్నారు. ఇక పారిపోవటమే గత్యంతరం.''

''పారిపోకండి...పారిపోయేవయసు మనకయిపోయింది. సూటిగా అడుగుతున్నాను. మనం పెళ్ళిచేసుకుందాం.''

''పెళ్ళి గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. అది నాకంత ముఖ్యమనిపించలేదు ఎప్పుడూ''

''ఇప్పుడు ఆలోచించండి.''

''ఏమో...'' అని ఆమె లేచి చెయ్యి కడుక్కోటానికి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళిపోయింది.

మర్నాడు పొద్దున్నే బస్సులో రామప్పగుడికి వెళ్ళారు సంధ్యా, శాయీ. సంధ్య చెప్పసాగింది - ''కాకతీయులు ఎన్నో జలాశయాలు తవ్వించారు. రామప్ప చెరువు అందులో ఒకటి. దీని గట్టునే మనం చూస్తున్న ఈ పాలంపేట దేవాలయం కాకతీయ వాస్తుశిల్పానికి మకుటాయమానం. చూడండి ఎత్తయిన అధిష్టానం మీద నాలుగంతస్థుల విమానంతో చాలా గంభీరమైన నిర్మాణం. లోపలికి పదండి. ఆలయ నాసికలో వివిధ భంగిమల్లోని స్త్రీ మూర్తులు, నాగిని ఎంత బావుంటాయో చూద్దురుగాని. దీన్ని కట్టించింది రేచర్ల రుద్రసేనానే అయినా, జాయపసేనాని రచించిన 'నృత్తరత్నాకరం'లో వర్ణించిన నాట్యభంగిమలకు లక్ష్యంగా ఈ నాట్యకత్తెల శిల్పాలు చెక్కారు. ఈ శిల్పాలలో ఏరోటిసిజం మొగ్గతొడిగింది. తరవాతికాలంలో ఖజురహో, కోణార్క్‌లలోని ఎరోటిక్ స్కల్ప్చర్‌కూ ఆధారం కాకతీయ శిల్పమే. ఈ లక్షణాలు అక్కడ వికసించాయి.''

ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు తిరిగి వచ్చారు శాయీ, సంధ్యా హైదరాబాదుకు. బస్సులో ఆమెతో ప్రయాణం చేస్తుంటే అన్పించింది శాయికి. 'జీవితమంతా ఈమెతో ఇలా వుండగలిగితే...'

వారం రోజుల తరువాత ఓరోజు ఆఫీసులో అడిగింది లలిత - ''మా చెల్లాయి మీకు నచ్చిందా, మానాన్న అడుగమన్నారు'' అని.

''ముందు ఆమెకు నేను నచ్చానో లేదో తెల్సుకోండి'' అన్నాడు శాయి.

''దాని ముఖం... దానికేం గావాలో దానికే తెలియదు. ఇన్నేళ్ళొచ్చినా అది ఇంకా చిన్న పిల్లే. ఇంతకు ముందు వివాహానికి అసలు సుముఖత చూపించేది కాదు. మీ ప్రస్తావన వచ్చినప్పుడు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు''

''సరే... నాకూ అభ్యంతరం లేదు''

అలా సంధ్యా, శాయిల వివాహమయింది. ఆమె ఎందుకు వివాహానికి విముఖత చూపేదో మొదటి రాత్రే అతనికర్థమయింది. అలంకరించుకుని తన గదిలో కడుగిడిన భార్యను దగ్గరకు తీసుకుని ముద్దాడబోతే, ఆమె విసుగ్గా ముఖంపెట్టి అతని చెయ్యిని పక్కకు తోసేసింది.

''అబ్బ వుండండి, నాకిదంతా అసహ్యం'' అంది ఆమె.

''ఏది అసహ్యం?''

''ఇవే ఈ కౌగిలింతలూ, ముద్దులూ... ఛీ ఛీ... మృగంలా మనిషిని కొరుక్కుతినటం.''

ఆమె మాటలకు స్థాణువైపోయాడు శాయి.

''స్త్రీ పురుషుల మధ్య ఇవి సహజం.''

''ఈ అసహ్యమంతా లేకుండా మనం స్నేహితుల్లాగా వుండలేమా? ఉండండి నేనామధ్య లేపాక్షి వెళ్ళాను కదా. అక్కడి ఆలయాన్ని రేఖా చిత్రాల్లో గీశాను. మీకు చూపుతాను.''

''నీ జీవిత రేఖాచిత్రాన్ని సరిగ్గా గీసుకోవటం లేదు నువ్వు''

''అంత భారీ డైలాగులు చదవకండి. ఇప్పుడేమయిందని. ఉండండి ఆ బొమ్మల్ని చూపిస్తాను. యు వుడ్ రియల్లీ లైక్ దెం'' అని అలమారలోనుండి ఓ పొడుగాటి ఫైలు తీసుకవచ్చి, పక్కమీద కూర్చుని శాయికాబొమ్మలు చూపసాగింది సంధ్య.

''ఇది ఎనిమిది అడుగులు ఎత్తున్న వీరభద్రుని విగ్రహం. విరూపణ్ణ కులదైవం రౌద్రభయానకమూర్తి అయిన వీరభద్రుడు, స్వభావానుగుణంగా పుర్రెల మాలను యజ్ఞోపవీతంగా ధరించాడు. ఒక చేతిలో తాను ఖండించిన దక్షుని శిరం, ఒక చేత ఖడ్గం, మరో చేతిలో ధనుస్సు. అరుణారుణ నేత్రాలు. నోటికిరువైపులా కోరలు... ఎలా వుంది? ఇది చూడండి... వీరభద్ర మూలస్థానంలో ఎడమవైపు స్థంభాన కన్పించే గజచర్మధారి. గజాసురుడి బాధ తాళలేక మునులు శివుడికి మొరపెట్టుకోగా, ఆ పరమేష్ఠి గజాసురుని వధించి, ఆ గజ చర్మం ధరించి ఇక్కడ దర్శనమిస్తున్నాడు.''

శాయికి నీరసమనిపించింది. మొదటి రాత్రి తన భార్య నుండి ఆశించింది ఈ కళాప్రదర్శన కాదు. ''నేనూ నువ్వు పెట్టే బాధ తాళలేకుండావున్నాను. ఏ దేవుడితో మొరపెట్టుకునేది?'' అన్నాడు చిరాగ్గా.

ఆమె అతని మాటలు పట్టించుకోలేదు ''అయ్యో! మీకు అలసటగా వున్నట్టుంది. అలా పడుకోండి. పడుకునే చూడవచ్చు. ఇది వీరభద్ర మూలస్థానానికి కుడిపక్క నేరుగా స్తంభంపైన చెక్కిన ఉత్తరాభిముఖుడైన శివుడు. రాక్షసుని మీద నిల్చునివున్నాడు. ధనుస్సు, అంకుశం, అగ్నిమాల చేత ధరించిన జటామకుటధారి. గగనం నుడి పుష్పవృష్టి...'' అని చెప్తోంది సంధ్య అతని పక్కన మోచేతి మీద నడుంవాల్చి. ఆమె దృష్టి అంతా బొమ్మమీద వుంది. అతని దృష్టి ఆమె అందాల్ని పరికిస్తున్నది.

''అవి తరవాత చూడవచ్చులే. ముందు దగ్గరిగారా...'' అని ఆమె చెయ్యి పట్టుకులాగాడు శాయి.

''అబ్బ వదలండి. బొమ్మ చిరిగిపోతుంది. నాకిదంతా నచ్చదని చెప్పానా?'' అంది విసుక్కుంటూ.

శాయికి కోపం వచ్చింది ఆమె మాటలకు అలిగి పక్కకు తిరిగి పడుకున్నాడు మాట్లాడకుండా. ఆమె ఆ బొమ్మలన్నీ ఫైల్లో సర్ది, ఫైల్ని అలమారులో పెట్టి అతనికి దగ్గరగా వస్తూ అంది - ''ఏంటలా వున్నారు? ఒంట్లో బావుండలేదా? తలనొప్పా?''

శోభనం గదిలో తన పరిస్థితిని గమనించక, తలనొప్పా అని అడిగే భార్యకేం చెప్పాలో తోచలేదు శాయికి. ''ఆఁ...'' అన్నాడు లోపలి కోపాన్ని ధిగమింగుకుంటూ.

''అయ్యో... అమృతాంజనమయినా లేదే. తలపడ్తాను. నిద్రపొండి. అదే తగ్గిపోతుంది'' అని లైటార్పి వచ్చి అతని నుదురు వత్తసాగింది సంధ్య.

ఆమె చర్యలకు అతనికి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు. తనపట్ల సానుభూతి వుంది. తనేం చేస్తున్నదో తనకు తెల్సు. కాని అది ఆమెకు సుతరామూ ఇష్టంలేదు. ఆలోచిస్తూనే అలాగే పడుకుని వుండిపోయాడు శాయి. పావుగంట తరువాత అతడు నిద్రపోయాడని నిర్ధారణ కొచ్చిన సంధ్య తనూ పక్కమీద ఓ మూల ముడుచుకుని పడుకుంది. క్షణంలో ఆమెకి నిద్రపట్టేసింది కాని శాయికి మాత్రం ఆ రాత్రి కంటిమీద కునుకులేదు. తనసలా పెళ్ళి, ఈ ముదిరిన వయసులో ఎందుకు చేసుకున్నాడో అతనికర్థంకాలేదు. ఏమాశించి చేసుకున్నాడు? లైంగిక సుఖమా? సంతానకాంక్షా? దేనికోసం. ఏదీ సమకూరేట్టేలేదు. ఈ ఫ్రిజిడ్ ఉమన్ పాండిత్య భ్రమలోపడిపోయాడు తను. ఆమెను ఓర్పుగా దారిలోకి తెచ్చుకోవాల్సిందే తప్ప, బలవంతం చేసి ప్రయోజనం లేదు. ఎంత అమాయకంగా నిద్రపోతోంది. ఈమె ఇంత అందమూ వృధానేనా? కళ్ళు మూసుకుపడుకోగా ఎప్పటికో నిద్రపట్టింది అతనికి.

మిగతా రెండు రాత్రులయినా మొదటి రాత్రికి భిన్నంకాదు. అలాగే గడిచిపోయాయి. పెద్ద ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. మెల్లమెల్లగా సంధ్యను తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నం చేశాడు శాయి. ఆమె పనిలో సాయంచేసేవాడు. ఆమెకోసం తనూ వాస్తుశిల్పకళలో ప్రవేశం, అభిరుచి కల్పించుకో ప్రయత్నించాడు. ఆమె అతనంటే ఎంతో ప్రేమగా వుండేది కాని దగ్గరికి మాత్రం రానిచ్చేది కాదు.

వాళ్ళ వివాహమయిన ఆరునెలలకు సివియర్ ఆస్త్మాటిక్ అటాక్‌తో పోయాడు పరమేశంగారు. ఆయన అపర కర్మలయాక అంది లలిత - ''ఇంత ఇంటిలో నేనొక్కదాన్నే ఏం వుంటాను. మీరూ వచ్చి వుండండి'' అని.

ఆ సూచనకు సంధ్య ఎంతో ఉత్సాహాన్ని చూపించింది. ఇంటిపనీ, వంటపనీ అక్కే చూసుకుంటుంది. అందువల్ల తనపని చేసుకోవటానికి వెసులుబాటుగా వుంటుంది ఆమెకి. శాయికి వేరే అభ్యంతరమేమీలేదు. తమ అద్దె ఇంటిని ఖాళీచేసి లలితతోపాటే వుండసాగారు సంధ్యా, శాయీ.

ఎంత ఓర్పు వహించినా సంధ్యలో మార్పేం కన్పించలేదు శాయికి. ఓరోజు రాత్రి భార్యనడిగాడు అతను- ''అసలు నువ్వు పెళ్ళెందుకు చేసుకున్నావో నాకర్థం కావటంలేదు'' అని.

''నాకసలు చేసుకోవాలని లేదు. నాన్నా, అక్కా పట్టుబడితే తప్పలేదు'' అంది సంధ్య.

''అయితే ఎవరైనా బలవంతం చేస్తేనే కానీ, నీ అంతట నువ్వేం పనిచేయవన్న మాట''

''అంటే?''

''ఏం లేదు... నీ స్వభావం తెలియక నేనిన్నిరోజులు అనవసరంగా కాలయాపన చేశాననిపిస్తోంది.''

''ఏం వృధా అయింది. ఈ ఆర్నెల్లు ఎంత చక్కగా గడిచిపోయాయి. ఎన్ని కళాత్మక శిథిలాలున్న ప్రదేశాలు చూశాం. వివాహజీవితం ఇంత థ్రిల్లింగ్‌గా వుంటుందని నాకు తెలీదు. లేకపోతే ఎప్పుడో పెళ్ళిచేసుకునుండేదాన్ని'' అంది సంధ్య.

''ఇంకా థ్రిల్లింగ్‌గా వుంటుంది నువ్వు సహకరిస్తే. వైవాహిక జీవితమంటే కళాత్మక శిథిలాలు చూడటం కాదు. భర్త జీవితం శిథిలంచేస్తూ, నీ జీవితం శిథిలం చేసుకోవటం కాదు.''

''ఏమయింది ఇవాళ మీకు. ఇలా మాట్లాడుతున్నారు?''

''ఐ డిమాండ్ మై కంజూగల్ రైట్స్ ఫ్రం మై వైఫ్.''

''ఏంకావాలి మీకు?''

''ఏం కావాలో తెలుసు నీకు''

''నాకక్కర్లేదది''

''నాక్కావాలి''

''పడుకోండి, మళ్ళీ పొద్దున్నే లేవాలి'' అని లైటార్పేసిందామె.

ఆమె పక్కమీద నడుంవాల్చగానే ఆమెను దగ్గరకు లాక్కుని కౌగిలిలో బిగించాడు శాయి.

''వదలండి... ఏమిటది జంతువుల్లా''

''ఇవాళ నా కోరిక తీరకపోతే నిజంగా జంతువునే అయిపోతాను.''

ఆమె అతన్ని తప్పించుకోవటానికి గింజుకుంది. అతను ఆమెను వదలలేదు.

''వదలండి.. మీక్కాదూ చెప్పేది. మనిషా, దున్నపోతా?''

అతను వదలలేదు. ఆమె మీదపడి ఆమె అంగాంగాన్ని స్పృశిస్తున్నాడు.

''ఛీ.... ఏమిటిది? రాక్షసుడా! వదలు....'' అని ఆమె అతడి బారినుండి తప్పించుకోటానికి పోరుతూనే వుంది.

అలా ఆమె తిడ్తున్నకొద్దీ అతనిలో కోపం ఎక్కువైంది. కసీ, పాశవికతా పెరిగాయి. తప్పించుకునే ప్రయత్నంలో ఆమె అతని మొహాన్ని గోళ్ళతో రక్కసాగింది. నోటితో కరవసాగింది. కోపంతో అతను ఆమె చెంపలు వాయించాడు. అయినా ఆమె పెనుగులాట ఆపలేదు. చివరకు ఓపిక నశించి అతనికి లొంగిపోయింది ఆమె.

వేడి చల్లార్చుకున్నాడే తప్ప అతనికా రాక్షసరతిలో ఆనందం కలగలేదు. భార్యనే రేప్ చేసిన ఆత్మగ్లాని కలిగిందతని మనసులో. తలవంచుకుని పక్కమీద కూర్చుండిపోయాడు, తప్పుచేసిన వాడిలా, దోషిలా.

''ఛీఛీ... ఖా...'' అనుకుంటూ లేచి ఆమె బాత్‌రూంలోకి వెళ్ళింది.

ఎంత సేపటికీ ఆమె బాత్‌రూం నుండి బయటపడకపోతే శాయికి భయమేసింది. అతను బాత్‌రూం తలుపుతట్టి ఆమెని పిల్చాడు. తట్టగా, తట్టగా ఆమె బదులు పల్కింది ''వస్తున్నా... మీరు పడుకోండి'' అని.

ఆ తరువాత అరగంటకుగాని ఆమె బాత్‌రూం నుండి బయటపడలేదు. తలారా స్నానం చేసి వచ్చింది. వంటికంటుకున్న మైల వదిలించుకున్నట్లుంది ఆమె. కప్‌బోర్డ్‌లోనుండి ఇస్త్రీ చీరె, జాకెట్టు తీసి కట్టుకుంది. జుట్టును తడిపోయేట్టు టవలుతో తుడుచుకుని జడ వేసుకుంది పౌడరు రాసుకుని బొట్టు పెట్టుకుంది. వంటికంటిన దుర్గంధం పోయేట్టుగా స్ప్రే చేసుకుంది. ఆ తరువాత అతనివంకైనా చూడకుండా నేలమీద దుప్పటి పరుచుకుని పడుకుంది సంధ్య. అతనితో మరోమాట మాట్లాడలేదు. ఇదంతా చూస్తున్న శాయికి వళ్ళు కంపరమెత్తింది. మళ్ళీ జన్మలో ఆమెను స్పృశించాలన్న కోరిక నశించింది అతనిలో.

ఆ తరువాత సంధ్య అతనితో ఒకే గదిలో పడుకోవటం మానేసింది. తన పక్కా, తన వస్తువులు వేరే గదిలోకి సర్దేసుకుంది. అంతకుమించి ఆమెలో మార్పేంలేదు. అతని అవసరాలన్నీ తనే శ్రద్ధగా చూసేది. అతడెప్పుడు ఇంటికి తిరిగి వచ్చినా, వేచివుండి, అతనికి భోజనం వడ్డించేది. తమ మధ్య ఏం జరగనట్లు ప్రవర్తించేది, మాట్లాడేది.

లలితకీ పరిస్థితి ఓ పట్టాన అర్థంకాలేదు. శాయీ, సంధ్యా వేరు వేరు గదుల్లో ఎందుకు పడుకుంటున్నారో ఆమె ఊహించలేకపోయింది. శాయి ఈ మధ్య ఆఫీసు టైమయిపోయినా ఇంటికి తిరిగిరావటంలేదు. ఏదో పని కల్పించుకుని రాత్రి ఏడెనిమిది గంటలదాకా ఆఫీసులోనే వుండిపోతున్నాడు. కొత్త జంటకు సినిమాలు, షికార్లూ ఏమీ లేవు.

ఓ రోజు సాయంత్రం ఎనిమిదిగంటలకు అతను ఇంటికి వచ్చేటప్పటికి సంధ్య ఇంకా ఇంటికి చేరలేదు. అతను అడక్కుండానే చెప్పింది లలిత, ''సంధ్య ఇవాళ ఏదో మీటింగ్‌లో ఉపన్యాసమివ్వాలట. రాత్రి వచ్చేటప్పటికి పదవుతుందేమోనని ఫోన్ చేసింది. మిమ్మల్ని భోంచేయమంది.''

అతనేం మాట్లాడకుండా వెళ్ళి స్నానం చేసి వచ్చి టి.వి. ఆన్ చేసి తన గదిలో కూర్చున్నాడు. ''మీకు అన్నం వడ్డించేదా?'' అని వచ్చి అడిగింది లలిత.

''ఇప్పుడేం ఆకలిలేదు. అలా బయట తిరిగివస్తాను'' అని లేచి టి.వి. ఆఫ్ చేసి గుడ్డలు మార్చుకోసాగాడు శాయి.

''నేనడగొచ్చో లేదో నాకు తెలియదుగానీ, మీ మధ్య ఏదో కీచులాట జరిగినట్టుంది ఏమయిందో నేను తెలుసుకోవచ్చా'' అని అడిగింది లలిత.

''ఏం కాలేదు'' అన్నాడతను ముభావంగా.

''ఏంకాదు... మీరు దాస్తున్నారు''

''మీ చెల్లెల్ని అడగకపోయారా?''

''అడిగాను... ఏం లేదన్నదది''

''నిజమే... ఏం లేదు''

''మరి ఈ వేరువేరు పడకలు ... ఇదంతా ఏమిటి?''

''అదంతే... మీకూ నాకూ వున్న సంబంధానికీ, నాకూ సంధ్యకూ వున్న సంబంధానికీ తేడా లేదు. షి ఈజ్ ఫ్రిజిడ్. ఆమెకు మొగుడుకాదు కావాల్సింది, సేవకుడు. ఆమె వెళ్ళాల్సిన ప్రదేశాలకు తిప్పేవాడూ, ఆమె పనిలో సాయం చేసేవాడూ కావాలి. దానికి మగాడే అక్కర్లేదు. కొజ్జా అయినా ఫర్లేదు...'' అని తాను అసభ్యంగా మాట్లాడుతున్నానన్న స్పృహ కలిగి మళ్ళీ అన్నాడు - 'సారీ... మనం వున్న సమాజంలో తన సమస్యనెలా తీర్చుకోవాలో తెలీక ఈ

అనవసరపు బంధంలో ఇరుక్కుంది సంధ్య. బయట పడాలని ప్రయత్నించాల్సిందిపోయి, సమస్యని మరింత జటిలం చేసుకుంటోంది'' అని ఇంట్లో నుండి బయట పడ్డాడు శాయి.

''అయ్యో!'' అని అవాక్కయి నిలబడి అతను పోయినవంకే చూస్తూండిపోయింది లలిత.

ఆ తరువాత లలిత సంధ్యకు చెప్పి చూసింది తన ప్రవర్తన మార్చుకోమని. కాని ఫలితం శూన్యం.

''అక్కా! మేమిక్కడ ఇలా వుండటం నీకిష్టంలేనట్టుంది. ఆయన బానే వున్నారు. నేనూ బానే వున్నాను. మధ్య నీకెందుకీదుగ్ధ? నేను వద్దంటే నువ్వూ, నాన్నా కలిసి బలవంతం చేసి ఈ పెళ్ళి చేశారు. నీకిష్టంలేకపోతే చెప్పు వేరే ఇంటికి వెళ్ళిపోతాం'' అంది సంధ్య.

''అయ్యో! అదేంటే నేనన్నదానికి పెడర్థాలు తీస్తావు. వచ్చిన అవకాశం పోగొట్టుకోవద్దు, జీవితాన్ని సరిదిద్దుకోమంటే నామీద నిష్ఠూరం. నాకంటే నీకు కావాల్సినవాళ్ళు ఎవరున్నారు?''

''అలా అయితే ఇంక మాట్లాడకూర్కో. మా సమస్య మేం తేల్చుకుంటాంలే'' అని లేచి వెళ్ళిపోయింది సంధ్య.

సంధ్యకు వంట్లో నలతగావుంటే లలిత సంధ్యను డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళింది. ఇంటికి రాగానే సంధ్య తన గదిలోకి వెళ్ళి తలుపు బిడాయించుకుంది. తీసిపోయినట్టున్న ఆమె ముఖం చూసి గాబరాపడ్డాడు శాయి.

''ఏమన్నది డాక్టరు'' అడిగాడు శాయి లలితను ఆదుర్దాగా.

''మీరు అబద్ధాలు చెప్తారన్నది'' అన్నది లలిత ముసిముసి నవ్వులు నవ్వుతూ-

''నేను అబద్ధాలు చెప్పటమేమిటి?''

''సంధ్య గర్భిణి అట''

''నిజమా''

''అవును... రెండోనెల'' 'దీనికేం సంజాయిషీ చెప్తారు' అన్నట్టు చూసింది లలిత అతని వంక.

అతనికేం తోచలేదు. ఒక్కసారి జరిగిన బలవంతపు కలయికకు ఇది సంభవమా? ఏమయినా అతనికానందంగావుంది. తను తండ్రి కాబోతున్నాడు. జీవితపు చరమాంకంలో తన బిడ్డ తన సొంతం. తనకు బిడ్డను ప్రసాదించబోయే సంధ్య తప్పులన్నీ అతడి హృదయం క్షమించేసింది. తన బిడ్డకు సంధ్య రూపురేఖలొస్తే ఫరవాలేదు. ఆ మనస్తత్వం మాత్రం రాకూడదు.

శాస్త్రవిజ్ఞానపు కర్కశత్వమంతా ఆమెలో మూర్తీభవించి వుంది. జ్ఞానదాహమేకాని హృదయస్పందన లేదు ఆమెలో. ఇంక సంధ్యతో తనకు పనిలేదు. ఆమె ఆ బిడ్డను కనిస్తే చాలు.

''థాంక్యూ... థాంక్యూ వెరీమచ్'' అన్నాడతను తననుతాను సంభాళించుకుంటూ.

''నాక్కాదు.. సంధ్యకు చెప్పండి ఆమాట'' అని లలిత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

శాయి సంధ్య గది తలుపుతట్టాడు. నాలుగైదుసార్లు తలుపు తట్టిన మీదట ఆమె తలుపు తెరిచింది. ఆమెను చూసి నిర్ఘాంతపోయాడు శాయి. ఆమె ముఖం వాడిపోయివుంది. చెంపల కన్నీటి చారికలు, దిండులో తలుదూర్చి వాపోయినందువల్ల కాబోలు జుట్టు చిందర వందరగా వుంది.

''ఏంటలా వున్నావు సంధ్యా!'' అన్నాడతను ఆమె భుజం మీద చెయ్యివేస్తూ.

ఆమె అతని చెయ్యి విదిలించికొడ్తూ అన్నది - ''నన్నంటకండి. మీరు... మీరే చేశారు ఇదంతా...''

''ఏంచేశాను...?'' అన్నాడతను అయోమయంగా.

''ఈ పరిస్థితికి కారణం ఎవరు? జంతువులా మీదపడి, బలాత్కారించి... ఛీ...ఛీ...'' అందామె ఏడుస్తూ మంచంమీద పడిపోతూ.

''ఏమయిందిప్పుడు! అంతా మనమంచికే జరిగింది.''

''నాకీ గర్భంవద్దు. ఈ వయసులోనా... కని, పెంచి, సాకే ఓపిక నాకు లేదు. నా రిసెర్చికీ గర్భం అడ్డంకి...''

''కనటం వరకే నీపని, పెంచటం మేం చూసుకుంటాం''

''ఏం చూసుకుంటారు? నావల్లకాదు. నాకేమయినా అయితే...''

''ఏమీ అవదు... నువ్వు స్థిమితపడు...'' అన్నాడు శాయి అనునయంగా, ఆమె భుజంమీద చెయ్యివేస్తూ.

''నేనప్పుడే చెప్పాను, నాకీ పెళ్ళి ఇష్టంలేదని... వినలేదు, బలవంతంగా నన్నంటగట్టారు మీకు, మీరు నా మానాన నన్ను బతక నివ్వడంలేదు. ఎందుకు మీకందరికీ నేనంటే ఇంత కక్ష. వెళ్ళండి, వెళ్ళిపోండి... నాకు మీముఖం చూస్తే అసహ్యం వేస్తున్నది'' అని ఆమె దిండులో తలదూర్చి ఏడవసాగింది.

ఆమెను చూస్తుంటే లెంపలు వాయగొట్టాలన్నంత కోపం వచ్చింది శాయికి. కాని తమాయించుకున్నాడు. ఎలాంటిదయినా ఆమె తన బిడ్డకు తల్లి కాబోతోంది. 'ఏడవనీ, తనంతటతనే సంభాళించుకుంటుంది' అనుకుని ఆమె గదిలోనుండి బయటకొచ్చాడు శాయి. బయట కాఫీ కప్పు పట్టుకుని లలిత నిలబడివుంది. తనగదిలోకి దారితీస్తూ అన్నాడతను, ''విన్నారుగా... నేనేం అబద్ధం చెప్పానో... ఒకరోజు నా పాశవికతకు ఫలితం ఇది''

''అయాంసారీ...'' అందామె అవనతముఖియై.

ఈ జరిగిందంతా తన పొరపాటువల్లే జరిగినట్లు ఆమె బాధపడిపోతోంది.

''మీరు మనసు కష్టపెట్టుకోకండి. ఇనీషియల్ షాక్. అదే తమాయించుకుంటుంది. కాలమే పరిష్కరిస్తుంది అన్నీ'' అంది ఆమె అతని దగ్గరగా వచ్చి.

''ఇంత వింత ప్రకృతి వుండే మనుషులుంటారని నాకు తెలీదు''

''ఏమయిందిప్పుడు? దానిలాగే మీరూ ప్రవర్తిస్తున్నారు. షి విల్బి ఆల్రైట్. బిడ్డకు తండ్రికాబోతున్న ఆ ముఖంలో ఆ విచార రేఖ లేంటి? మీరు హుషారుగా వుండాలి. దాన్ని కూడా సంతోషంగా వుంచాలి....ముందు కాఫీ తీసుకోండి'' అంది లలిత. అతని భుజం మీద చెయ్యి వేసింది ఆమె, అతన్ని అనునయించటానికన్నట్లు.

''సంధ్యను కాదు, మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాల్సింది లలితా, పొరపాటు చేశాను''

''ఛీ... నన్నా, విధవనా? నాకేం పెళ్ళి... మతి పోయి మాట్లాడకండి.''

''నాక్కాదు మతిలేంది, ఆ పైవాడికి. స్త్రీత్వం లేని స్త్రీకి వివాహం. మాతృత్వం, స్త్రీత్వం మూర్తీభవించిన స్త్రీ వాటినుండి వంచిత అవటం. ఏం న్యాయం ఇది?''

''అలా మాట్లాడకండి, బావుండదు. ఎందుకీ నిర్వేదం. పుట్టబోయే బిడ్డకేం పేరు పెడ్తారు? బాబయితే మీనాన్నపేరు, పాప అయితే మీ అమ్మ పేరూ పెట్టండి. అలా బయటకెళ్ళి తిరిగి రారాదూ? మనసు కుదుటపడ్తుంది.''

మూడురోజులు గడచిపోయాయి. సంధ్య ఎవరితోనూ మాట్లాడటంలేదు. తనకు అన్యాయం చేసి తన ఆస్తి దోచుకున్న ద్రోహులుగా శాయి, లలిత వంక చూడసాగింది ఆమె. డాక్టరు ఇచ్చిన మందులు వేసుకోలేదు. నాలుగోరోజు పొద్దున అంది సంధ్య, ''సాయంత్రం బండికి అజంతా, ఎల్లోరా ఎక్స్కర్షన్ వెళ్తున్నాం. రెండు మూడు రోజుల తర్వాతే తిరిగి రావటం, ఆయనకి చెప్పు'' అని.

''ఈ పరిస్థితుల్లో వెళ్ళకపోతేనేం... ట్రిప్ కాన్సిల్ చేసుకోరాదూ'' అంది లలిత.

''వీల్లేదు... ఫిక్సయిన ప్రోగ్రాం కాన్సిల్ చేసుకోవాల్సిన అవసరం లేదు'' అని మరో మాటకు అవకాశం ఇవ్వకుండా తన గుడ్డలు సర్దుకున్న సూట్కేస్తో యూనివర్సిటీకి వెళ్ళి పోయింది సంధ్య.

మర్నాడు రాత్రికిగాని సంధ్య చేసిన పని తెలియలేదు లలిత, శాయిలకు. భోజనాలు చేసి పడుకోబోతున్నప్పుడు ఫోను రింగయింది. శాయి ఫోను ఎత్తాడు.

''హలో... ఎవరూ?'' అడిగాడతను.

''లలితగారు కావాలండీ...''

''లలితా! నీకు ఫోను...'' ఫోను ఆమె కందించాడు శాయి.

''హలో... నేను లలితను మాట్లాడుతున్నాను, ఎవరు?''

''నేను విజయా నర్సింగ్‌హోం నుండి నర్స్‌ను మాట్లాడుతున్నాను. మీ చెల్లెలు సంధ్య వీలయితే ఒక్కసారి పొద్దున మిమ్మల్ని ఇక్కడకు రమ్మంది.''

''నర్సింగ్ హోంలో చేరిందా? ఏమయింది ఆమెకు?''

''ఏం కాలేదు... అబార్షన్ చేయించుకున్నారు ఆమె. వంట్లో కులాసాగానే వుంది. కానీ అనవసరంగా గాబరా పడ్తున్నారు. అందుకనే మీకు ఫోనుచేసి చెప్పమన్నారు. ఆఁ వచ్చేటప్పుడు 'మెగాలిథిక్ ఆర్కిటెక్చరల్ పాట్టర్న్స్' అనే పుస్తకమేదో ఆమె గదిలో బల్లమీద వుందట. పట్రమ్మన్నారు.''

''అబార్షనా...?'' అని విమూఢయ్యై ఫోను జారవిడిచింది లలిత.

శాయికి చాలావరకు విషయం అర్థమైంది. అయినా నిర్ధారణ చేసుకోవాలన్నట్టుగా అడిగాడు, ''సంధ్య అబార్షన్ చేయించుకుందా?'' అని.

ఆమె నిర్జీవంగా 'అవున'న్నట్లు తలూపింది. లలితకు తను నుంచున్న భూమి తొలుచుకపోయినట్లనిపించింది. సంధ్య గర్భవతి అని తెల్సినప్పుడు శాయికన్నా ఎక్కువ ఆనందాన్ని అనుభవించిందామె. తన మరుభూమి లాంటి జీవితంలో అలాంటి అవకాశమే లేదు. ఎందుకు, ఎవరికోసం బతుకుతూందో అర్థంకాని బతుకు తనది. భర్తపోయిం తర్వాత జీవితమే శూన్యమయింది తనకు. రోగిష్టి తండ్రి సేవ చేయటంలోనూ, చెల్లికి మంచిచెడ్డలు చూడటంలోనూ సౌఖ్యాన్ని వెతుక్కుంది. ఆవరణలో పూలతోట పెంచటం, ఇంట్లో వంటా వడ్డనా, ఇంటిపనీ, బయటపనీ అన్నీ తనే చూసుకునేది. సంధ్యని ఏ పనీముట్టనిచ్చేదికాదు. 'చెల్లెలు బాగా చదువుకుంది, పండితురాలు. ఆమెకెందుకీ అనవసరపు అరవచాకిరీ' అని తనే చేసేది. ఆమెని 'ఇంకా ఇంకా చదువుకోనీ, ఇంకా ఎత్తులకు ఎదగనీ' అనుకుంది. శాయి ట్రాన్సఫరయి హైదరాబాదు వచ్చినప్పుడు, అతన్ని చెల్లెలికి అనువైన వరుడిగా ఎంచి, వాళ్ళిద్దర్నీ కలపటానికి ఎంత ప్రయత్నించింది తను. సంధ్య, శాయి ఒకరంటే ఒకరికి పడకుండా వున్నారంటే ఎంతగా బాధపడ్డది తను? ఇద్దర్నీ కలపటానికి ప్రయత్నించింది తను. తన ప్రయత్నమంతా బుగ్గిలో పోసిన పన్నీరయింది. మళ్ళీ అర్థం పర్థంలేని మరుభూమిలాంటి ఒంటరి జీవితం. సంధ్యకు తన రీసెర్చేమో తనేమో. తనకలాంటి వ్యాపకమేదీ లేదే? సంధ్యకు బిడ్డ పుడితే, ఆ బిడ్డను సాకటంలోని ఆనందంతో, ఓ లక్ష్యంతో కాలం గడపవచ్చునుకుంది. తనీ ఉద్యోగమూ మానేయాలనుకుంది. ఆ ఆశ అడుగంటింది. ఎందుకీ జీవితం?..

దిగ్భ్రాంతయ్యై ఆమె తూలిపడబోతుంటే శాయి ఆమెని పొదవి పట్టుకున్నాడు.

''నాకనుమానంగానే ఉంది. సంధ్య తను అనుకున్నది చేసేదాకా నిద్రపోదు. పోనీండి లలితా! గత జలసేతుబంధనం. జరిగిందానికి వగచి ప్రయోజనమేమిటి?'' అన్నాడు శాయి ఆమెను అనునయిస్తూ.

అతన్ని చూస్తున్న ఆమెకు తను అతనికి చేసిన అన్యాయం కొట్టవచ్చినట్టు కన్పించింది. గిల్టీగా ఫీలవసాగింది ఆమె. హాయిగా జీవిస్తున్న వాడిని, ఈ రొంపిలోకి తనే లాగింది. జీవితంలో సుఖంలేకుండా చేసింది.

''క్షమించండి... ఇలా అవుతుందనుకోలేదు'' అంది ఆమె విహ్వలయై.

''వెళ్ళి పడుకోండి లలితా!'' అన్నాడు శాయి నిర్వేదంగా.

''నాకు దాని మొహం చూడాలన్పించటంలేదు...'' అంది లలిత తన గదిలోకి వెళ్తూ.

''ఆమెదేం తప్పులేదు. ఆమెని అంచనావేయటంలో మనమే పొరపాటు చేశాం'' అన్నాడతను సోఫాలో కూలబడి.

శాయికీ మనసు విచలితమయిపోయింది. తను ఏం చూసుకుని బతకాలో అతనికీ అర్థంకాలేదు. తనీ వివాహం చేసుకోకున్నా బావుండేది. అప్పుడెలాంటి వ్యామోహాలు, ఆశలు తనలో కలిగేవి కావు. ఇంత నైరాశ్యమూ కలిగేదికాదు. డబ్బు సంపాదించేవాడు. కూడబెట్టేవాడు. పోయేటప్పుడు అది తనవాళ్ళకిచ్చిపోయేవాడు. తనకోసం జీవించదల్చుకున్న బతుక్కి గమ్యంలేకుండా పోయింది. ఆ నిశీధిలో తన జీవితమంతా గాఢాంధకారం అలుముకున్నట్లనిపించింది అతనికి.

తన ఆలోచనలో తానుండిపోయిన శాయికి లలిత వెక్కిళ్ళు పెట్టి ఏడవటం వినిపించింది. ఉలిక్కిపడినట్లయి ఆమె గదిలోకి వెళ్లాడు.

''ఏమిటిది, చిన్నపిల్లలా? ఇప్పుడేమయిందని!''

''ఏంకాకుండా ఏం మిగిలిందికనుక'' అందామె రోదిస్తూనే.

పక్కమీద కూర్చుని ఆమె భుజం మీద చెయ్యివేసి అనునయించసాగాడు.

''నాబిడ్డపోయాడు. కనటంవరకే దాని వంతు పెంచి పెద్దచేయటం నా బాధ్యత అనుకున్నాను. కల బూడిదయింది.''

శాయి ఏం మాట్లాడకుండా ఆమెవంక చూస్తూ వుండిపోయాడు.

''మీకన్యాయం చేశాను. పాపిష్టిదాన్ని ఇలాంటి నిష్ఠురసంబంధం కలపకుంటే మీ జీవితం వేరుగా వుండేది. మీరెందుకు చేసుకున్నట్టీ పెళ్ళి? భార్య సౌఖ్యంకోసమా! బిడ్డల అనురాగంకోసమా! వాళ్ళను పెంచి పెద్దచేసి ఆనందపడే తృప్తికోసమా? నేనే... నేనే చేశాను ఇదంతా. నా పాపానికి నిష్కృతిలేదు''

మానవులు చేసిన ఒక పొరపాటుకు చింతిస్తూ మరో పొరపాటు చేస్తారు. ఆమెని అనునయించటానికన్నట్లు ఆమెను దగ్గరకు తీసుకున్నాడు శాయి. వంటరితనాన్నుండి, మనోవేదన నుండి పారిపోటానికన్నట్లుగా అతని ఆసరా దొరగ్గా అతన్ని పెనవేసుకుపోయింది లలిత. స్త్రీ పురుషవివక్షత లేదు బాధా తప్త మనస్కులకప్పుడు. కాని దరికిచేరిన తనువుల్లో ఎప్పటి నుండో అంతశ్చేతనలో అణగివున్న ఆకాంక్ష ఉధృతమై, వెల్లువై వారిని ముంచేసింది. ఆ క్షణంలో వాళ్ళకీ ప్రపంచం, రాబోయే పరిణామాలు అన్నీ ఆత్మ విస్మృతిలో పడిపోయాయి. మొదటిసారిగా స్త్రీ అంటే ఏమిటో అతనికర్థమయింది. తనెంత పొరపాటు చేశాడో అర్థమయింది అతనికి. సౌదామినిని చూసి మిరిమిట్లు పొందిన కళ్ళు శరశ్చంద్రికలోని చల్లదనాన్నీ హాయినీ గమనించలేకపోయాయి.

కాని తెల్లవారుఝామున మెలకువ వచ్చిన అతనికి తనమీద చేయివేసి పడుకున్న లలితను చూసినప్పుడు తనెంత పొరపాటు చేశాడో అర్థమయింది. ఆమెకి, లలితకు తను ముఖమెలా చూపించగలడు! తనీ వాతావరణం నుండి పారిపోవాలి. లేకపోతే తనకు మనశ్శాంతి వుండదు.

రెండుజతల గుడ్డలు సూటుకేసులో పెట్టుకుని, బట్టలు మార్చుకుని, లలిత లేవకముందే ఇంట్లోనుండి బయటపడ్డాడు శాయి. సీదా సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసుకువెళ్ళి, ఆఫీసుకు రెండు నెలలు సెలవుకావాలని టెలిగ్రాం కొట్టి, ఆటోలో బస్‌డిపోకి వెళ్ళిపోయాడు. విజయవాడ బస్సులో కూర్చున్నదాకా అతనికి మనశ్శాంతి లేదు.

విజయవాడ తమ్ముడింట్లో వారం రోజులున్నాడు. బందరు అక్కగారింటికి వెళ్ళాడు. చెల్లెళ్ల ఇళ్లకు వెళ్ళాడు. ఎక్కడికి వెళ్ళినా అతనికి రోజులు గడవటం కష్టమయింది. మనశ్శాంతి దొరకలేదు. తనతోడబుట్టిన వాళ్ళు, తను మార్గనిర్దేశం చేసినవాళ్లందరూ బిడ్డా పాపలతో హాయిగా వున్నారు. తనకే మనశ్శాంతి కరువైంది జీవితంలో. తనకు బిడ్డ పుట్టివుంటే, జీవిత చరమాంకంలో అయితేనేం, అపురూపంగా చూసుకునేవాడు. తల్లి కాఠిన్యం బిడ్డలో రాకుండా తనూ, లలితా జాగ్రత్తపడేవాళ్ళు. కాని... లలిత...లలితకెలా ముఖం చూపించగలడు తను. సంధ్య దగ్గరకు మళ్ళీ ఎలా వెళ్లగలడు? వెళ్ళినా ప్రయోజనం లేని బతుకేం బతుకది.

ఎక్కడకు తిరిగినా చివరకు హైదరాబాదు తిరిగిరాక తప్పలేదు. తన జీవితనౌకకు లంగరు అక్కడే వేసుకున్నాడు అతను. హోటల్లో దిగి, ఉద్యోగంలో జాయినయ్యాడు. వచ్చినప్పటినుండి లలితను తప్పుకు తిరగాలనే ప్రయత్నించాడు కాని ఆమె స్టెనో అవటంవల్ల ఆమెను పిలవకా తప్పలేదు, లెటర్స్ డిక్టేట్ చెయ్యకా తప్పలేదు. వచ్చిన కొత్తల్లో ''మీరెక్కడికెళ్ళారో తెలియక మేం చాలా భయపడ్డాం'' అని ఆమె మాటలు కలుప ప్రయత్నించింది కాని, దానికేం సమాధానమివ్వక లెటర్ డిక్టేషన్ మొదలెట్టటంతో ఆమెకు సంభాషణ పొడిగించే ధైర్యం లేకపోయింది. ఆ తరువాత ఆమె ఆ ప్రయత్నం చెయ్యలేదు.

నెలరోజుల తరువాత ఓరోజు సాయంత్రం ఇంటికి వెళ్ళబోతూ అతని ఛేంబర్‌లోకి వచ్చింది లలిత. కళ్ళెత్తి ప్రశ్నార్థకంగా ఆమె వంక చూశాడతను.

''మీతో ఓ సారి మాట్లాడాలి. ఎక్కువ టైము అక్కర్లేదు. పదినిమిషాలు చాలు'' అంది లలిత అతనివంక చూస్తూ.

ఎంతో అవసరమయితేగాని ఆమె అలా అడగదని అతను అర్థంచేసుకున్నాడు.

''కూర్చోండి, చెప్పండి'' అన్నాడు.

ఆమె సందేహిస్తూ కుర్చీలో కూర్చుంది.

''నేను మద్రాసు ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ కష్టయిచేశాను. మీరప్పుడు శలవులో వున్నారు. హెడ్డాఫీసు నుండి ఇవాళే నా అప్లికేషను ఏక్సెప్ట్ చేస్తూ ట్రాన్సఫర్ ఆర్డర్లు వచ్చాయి. నిన్నే ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షనువాళ్ళు చెప్పారు. రెండురోజుల్లో వెళ్ళి అక్కడ జాయినవాలి. రేపు వెళ్ళిపోతున్నాను'' అంది ఆమె.

''అదేం... ట్రాన్స్‌ఫరెందుకు?'' అన్నాడతను ఆశ్చర్యపోతూ.

''ఇంతకాలం నేను పనిచేసిన ఆఫీసులో ఇదివరకులా ఇహ మెలగలేను. అది మీకూ మంచిదికాదు. విధవ గర్భవతి అవటం, సమాజం అనుమానంగా అవమానకరంగా చూడటం భరించలేను. నాగురించి ఎవరికీ ఏమీ తెలీని సమాజంలో బతుకుతాను.''

''వ్వాట్...! యువార్ ప్రెగ్నెంట్...!''

''అవును... ఎన్నో ఏళ్ళ తరువాత మళ్ళీ ఆ ఒక్కరోజు రాత్రికి స్త్రీనయ్యాను. మీరు వెళ్ళిన నెలా పదిరోజులకల్లా నా పరిస్థితి తెలిసింది. అబార్షనుకు ప్రయత్నించి వుండాల్సింది. కాని నాకిష్టంలేదు. మీరూ ఇష్టపడరు. మన జీవితాలకో ఆలంబనం దొరకబోతూవుంటే పోగొట్టుకోవటం నావల్లకాలేదు. సంధ్యకీవిషయం తెలియదు. నేను చెప్పలేదు. దానికి ముఖం చూపించటానికే నాకు సిగ్గుగా వుంది. మీరూ చెప్పాల్సిన అవసరం లేదు. మళ్ళీ ఇటువైపు రాను. అక్కడే బిడ్డని కనిపెంచుతాను. మీకూ చెప్పగూడదనుకున్నాను. కానీ మీకు పుట్టబోయే మీ బిడ్డ సంగతి చెప్పకుండా దాచటానికి నాకు మనసొప్పలేదు. జీవితంలో మనం మళ్ళీ కలుసుకుంటామో లేదోగాని నా తప్పులను మన్నించండి. సంధ్యను క్షమించండి. దానిది పసిపాప మనస్తత్వం. పెద్దమనసుతో దాన్ని స్వీకరించండి'' అంటూ ఆమె లేచింది.

''మీరు వెళ్ళాల్సిన పనిలేదు. మనం పెళ్ళి చేసుకుందాం'' అన్నాడుశాయి ఆవేశంగా.

''అది కుదరనిపని... నేను గర్భవతినైన కారణంగా పెళ్ళిచేసుకోవాల్సిన అవసరంలేదు. సంధ్యకు నేను అన్యాయం చెయ్యలేను.''

''మీరు సంధ్యకేం అన్యాయం చెయ్యటంలేదు, ఆమె జీవితాన్ని ఆమే అన్యాయం చేసుకుంటోంది.''

''ఈ విషయంలో మీరేం చెప్పి ప్రయోజనంలేదు. పుట్టే బిడ్డ మీ బిడ్డగానే పెరుగుతుంది. నెలరోజులయింది సంధ్య నార్తిండియా టూరుకెళ్ళి. ఇవాళో రేపో వస్తుంది. నాకు ట్రాన్స్‌ఫరయినట్లు ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోతాను. రేపు మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్నాను. రిజర్వేషను కూడా అయింది. రేపు పొద్దున వచ్చి ఆఫీసులో రెలింక్విషింగ్ చార్జి రిపోర్ట్ ఇస్తాను. మీరు స్టేషనుకు రావాల్సినపని లేదు. ఈ జీవితంలో నాది ఒంటరి ప్రయాణం. అలాగే సాగనివ్వండి. నా అంతట నేను మీకు మళ్ళా కన్పించటాని కి ప్రయత్నించను. నా అభ్యర్థనా అదే! మీరు నన్ను మర్చిపోండి, నాదగ్గరకు రావటానికి ప్రయత్నించకండి. మీ బిడ్డ నాదగ్గర పెరుగుతుందన్న భావనతో, తృప్తితో జీవించండి - వుంటాను...'' అని ఆమె లేచి వెళ్ళిపోయింది.

శేషశాయి నిశ్చేష్టుడై చూస్తూవుండిపోయాడు.

లలిత వెళ్లిన వారంరోజులకు సంధ్య శాయికి ఫోను చేసింది.

''మీరు చెప్పకపోయినా నాకర్థమయింది లెండి, మీకు కోపం వచ్చిందని. కాని ఏం చేయను. నా పరిస్థితుల్లో అబార్షను తప్పనిసరి. అక్కకు మద్రాసు ట్రాన్స్‌ఫరయిందిగా మీకు తెలీదూ? ఇంక కోపం మాని ఇంటికి రండి. నార్తిండియా టూర్ సంగతులు చెప్పాలని ఎంతగా తహతహలాడుతున్నానో మీకు తెలియదు. చాలా ఇంట్రస్టింగ్ విషయాలు తెలిశాయి. కొత్త థియరీ ఒకటి నేను ప్రపోజ్ చేయబోతున్నాను. అది ఆర్కియోలాజికల్ వరల్డ్‌లో గొప్ప సంచలనం రేపుతుంది. మీకివన్నీ చెప్తేగానీ నాకు తృప్తిగా ఉండదు. సాయంత్రం ఇంటికి వచ్చేయండి. ఏం సరేనా?''

శాయికీ ఎటూ పోయే తోవలేదు. ''సరే''నని ఫోను పెట్టేశాడు.

శాయి జీవితం నిర్జీవంగా గడుపుతున్నాడు. సంధ్యకు జీవితంలో నిరాశా, నిస్పృహలు లేవు. ఆమెనెప్పుడూ రీసెర్చ్ దయ్యం ఆవహించే వుంటుంది. ప్రొఫెసర్‌గా కూడా ప్రమోట్ అయింది. ఎప్పుడూ కాన్ఫరెన్స్‌లు, టూర్లు బిజీలైఫ్. గొప్ప ఆర్కియాలజిస్టుగా ఆమెకు పేరు ప్రఖ్యాతులొచ్చాయి. తానెంత బిజీగా వున్నా తాను ఊళ్లో వున్నంతకాలం శాయిని నిర్లక్ష్యం చేసేదికాదు ఆమె. రోజూ తనే వండి వడ్డించేది. అతనికి ఇష్టమైన పదార్థాలే చేసేది. కొసరి కొసరి తినిపించేది. అతనికి ఒంట్లో బాగుండకపోతే, తనకెంత అవసరమైన పన్లున్నా మానుకుని సేవ చేసేది. సాంసారిక జీవితం నుండి అతన్ని వంచించినందుకు అది ఆమె చూపించే కన్సెషనే కాదు, ప్రేమించేది కూడా. తప్పుచేశాననే భావనే కాకుండా అతణ్ణి మంచి స్నేహితుడిగా గౌరవించేది, ప్రేమించేది, అమ్మలా చూసుకునేదతడిని.

సంవత్సరం తర్వాత లలితనుండి శాయి ఆఫీసు అడ్రసుకు ఉత్తరం వచ్చింది. క్లుప్తంగా ఇలా రాసింది.

''మీకు కొడుకు పుట్టాడు. పేరు ఆనంద్. బాబు ముమ్మూర్తులా మీపోలికే.

- కృతజ్ఞతలతో - లలిత''

శాయి తండ్రిపేరు ఆనందయ్య. ఆమె చెప్పినట్టే చేసింది.

సంధ్యకీవిషయం తెల్సింది.

''విన్నారా ఇది! అక్క అక్కడెవరితోనో సంబంధం పెట్టుకుంది. దానికి కొడుకు పుట్టాడు. మొన్న మా స్నేహితురాలు రాజీకి మద్రాసులో కన్పించి ఇంటికి తీసుకువెళ్ళిందట. 'తను తప్పుచేశాననీ, మనకు మొహం చూపించలేననీ' అన్నదట. 'నీకు కావాల్సింది నువ్వుచేశావు. ఇందులో తప్పుచేశావని బాధపడాల్సిన అవసరంలేదు. బాబుకు పిన్ని, బాబాయి ముద్దులు అందచేయి. ఓసారి ఇక్కడికి రండి' అని ఉత్తరం రాస్తాను. చివరకెలాగో దాని జీవితానికో ఆలంబన దొరికింది. మీరేమంటారు? అక్క తప్పుచేసిందా?'' అని అన్నది శాయితో.

''లేదు... లేదు.. తప్పెందుకవుతుందీ. ఎవరి జీవితపంథా వాళ్ళేర్పరుచుకునే హక్కు వాళ్ళకుంది. ఎవర్నెవరు తప్పులెంచగలరు?'' అన్నాయి శాయి.

''ఇదుగో ఇలా ద్వంద్వార్థాలతోనే మాట్లాడొద్దనేది మిమ్మల్ని'' అంది సంధ్య.

★ ★ ★

''ఇదీ మా శేషశాయి కథ. వాడు అప్పుడప్పుడూ తన గోడు నాతో వెళ్ళబోసుకునేవాడు. వాడు చెప్పిన మాటలకు కొంత నా ఊహ జోడిస్తే వెరసి ఇది మావాడి కథ. ఇప్పుడు పిల్లవాడికి ఐదేళ్ళో, ఆరేళ్ళో వుంటాయి. మొన్న శాయి ఏక్సిడెంటులో పోయాడు కదా. ఒళ్ళంతా గాయాలతో ఆసుపత్రిలో చేర్చారు. నాకు కబురుపంపారు. వాడు లాయర్ని పిలిపించమంటే తీసుకువెళ్లాను. వీలునామా రాయించాడు. నాతో అన్నాడు.

''ఈమధ్యే బషీర్‌బాగ్‌లో ఓ ఫ్లాట్ కొన్నాను. బ్యాంకులో మూడు లక్షలున్నాయి. బ్యాంకుడబ్బు ఇప్పుడే నీపేర ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను. ఇంటినీ, డబ్బునీ నీ ఇష్టమొచ్చినవిధంగా, నీకేది న్యాయమని తోస్తే ఆవిధంగా డిస్పోజ్ ఆఫ్ చెయ్యి. 'పవర్ ఆఫ్ అటార్నీ' నీపేర రిజిష్టరు చేస్తున్నాను. సంధ్య పేరుకు భార్య. సరే... ఏమయినా భార్యే. కొడుకుని కనిచ్చిన భార్య కాని భార్య లలిత. నా ఆస్తి ఎవరికివ్వాలో తేల్చుకోలేని పరిస్థితిలో వున్నాను. ఇప్పుడా మనస్థితీ నాకు లేదు. నువ్వే నిర్ణయించు. నీ నిర్ణయం న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా వుంటుందని నాకు తెల్సు. ఎవరికి నా డబ్బు, ఆస్తి ఇవ్వాలనిపిస్తే వాళ్లకివ్వు... ఇంక ఆలోచించే సమయం లేదు నా జీవితంలో'' అన్నాడు వాడు.

ఇంకేదో చెప్పాలనుకున్నాడు కానీ వాడికి మళ్ళీ మగతకమ్మేసింది. మళ్ళా స్పృహరాలేదు. ఆ మర్నాడే పోయాడు. నువ్వు వచ్చి చూశావుగా వాడిని ఆస్పత్రిలో. వాడికి ప్రమాదం జరిగినప్పుడు సంధ్య ఊళ్ళోలేదు. ఆమె టెలిగ్రాం అందుకుని వచ్చేసరికి వాడి ప్రాణం పోనేపోయింది. లాయరుద్వారా వీలునామా కాపీ అందినప్పుడే ఆమెకి తెల్సింది శాయి ఆస్తిని, డబ్బుని నా 'పవర్ ఆఫ్ అటార్నీ' కిందకు మార్చాడని. అందుకే ఈ వుత్తరం రాసింది ఆమె. ఇప్పుడు చెప్పు ఆస్తి ఎవరికివ్వమంటావు సంధ్యకా, లలితకా? లలితకిచ్చేటట్లయితే శాయి, లలితలమధ్య వున్న సంబంధం సంధ్యకు తెలియకూడదన్నాడు వాడు'' అన్నాను నేను.

''అతని ఆస్తి వీళ్ళిద్దర్లో ఎవరిదీ కాదు. ఆ పిల్లవాడు మీ మిత్రుడి కొడుకు - వాడే అతని ఆస్తికి వారసుడు. పిల్లవాడి తల్లిగా కొడుకు ఆస్తి జాగ్రత్త చేసుకునే బాధ్యత లలితది. ఆమెకే ఇవ్వండి ఆ డబ్బూ, ఆ ఇల్లూ. న్యాయం అంటే చట్టం దృష్టిలో మీ మిత్రుడి భార్య సంధ్య. ధర్మబద్ధంగా అంటే సమాజపు ఆచారాన్ని, కట్టుబాటుల్ని అధిగమించిన ధర్మందృష్టిలో ఆయన భార్య లలిత, ఆయన బిడ్డకు తల్లి. ఏమంటారు?'' అంది మా ఆవిడ.

''చాలా బాగా చెప్పావోయ్. నా మనసు తెలుసుకు మాట్లాడావు. సత్యం చెప్పావు. అదీ భార్యంటే ఇలా, నీలా వుండాలి'' అన్నాను.

''ఆడపిల్లకి మంచి భర్త దొరకడం ఎంత అదృష్టమో మగవాడికి అనుకూలవతి అయిన భార్యదొరకడం అంతకు రెండింతలు అవసరం.''

ఆ క్షణంలో చిరునవ్వుతో శాయి సజీవంగా నా ముందు నిలబడినట్లయి కళ్ళు చెమర్చాయి.

'విపుల' మాసపత్రిక
మార్చి 1992